వీధి శునకాల సేవకుడు

- వీధి శునకాల క్షుద్బాధ తీరుస్తున్న పాస్టర్
- కరోనా లాక్‌డౌన్‌లో జాలితో ఆహారం అందించారు
- ఆ తృప్తితో నిత్యకృత్యం చేసుకున్నారు
- రోజూ రెండుపూటలా శునకాలకు ఆహారం

తెనాలి: నిత్యావసరాల కోసం రోజులో నాలుగైదు గంటలకు కర్ఫ్యూ సడలింపు. ఒకపక్క కరోనా భయం...కొద్దిపాటి వ్యవధిలోనే కావాల్సినవన్నీ తెచ్చుకోవటం...తలుపులు మూసుకుని ఇంట్లోనే కాలక్షేపం చేయటం...కరోనా లాక్‌డౌన్ తొలిదశ లాక్‌డౌన్ నాటి పరిస్థితి ఇది. ఎవరికివారు పూటగడిచేందుకు దేవుణ్ణి ప్రార్థిస్తున్న రోజుల్లో మూగజీవాల సంగతేంటి? వాటికీ ఆకలి వేస్తుందిగా...! ఆహారం ఎవరిస్తారు?...అని క్రైస్తవ దైవసేవకుడు ఒకరికి కలిగిన ఆలోచన ఇది. అనుకున్నదే తడవుగా ఇంట్లో ఆహారం చేయించి, దారిలో కనిపించిన వీధికుక్కలకు ఇస్తూ వెళ్లాడు. ఎగబడి తిన్న ఆ శునకాల కళ్లలో కనిపించిన కృతజ్ఞతను చూసి, మూగజీవాల ఆకలి దప్పులు తీర్చటాన్ని నిత్యకృత్యం చేసుకున్నారాయన. గాయపడిన పక్షులు, శునకాలకూ వైద్యం, ఆహారం అందిస్తున్నారు. ఆ తర్వాతనే తాను భోజనం చేయటానికి అలవాటుపడ్డారు.


వీధికుక్కలకు ఆహారం అందిస్తున్న దైవ సేవకుడు శ్రీనివాసరావు

వైద్యసేవలు సైతం..

ఆకలి తీర్చటంతోనే కాకుండా ఏదొక కారణంతో గాయాలపాలైన పక్షులు, వీధికుక్కలనూ శ్రీనివాసరావు సంరక్షిస్తున్నారు. గాయాలకు వైద్యం చేయించి, కోలుకునేవరకు ఆహారం ఇస్తున్నారు. ఇది తెలిసిన స్థానికులు, ఆపదలో ఉన్న మూగజీవుల సమాచారాన్ని శ్రీనివాసరావుకు చేరవేస్తున్నారు. 'లాక్‌డౌన్ కాలంలో ఇంటికి సమీపంలో ఓ కుక్క నీరసంగా పడుకొని ఉండటాన్ని గమనించి, ఆహారం ఇవ్వటంతో ఉత్సాహంగా లేచికూర్చొంది' అని శ్రీనివాసరావు గుర్తుచేసుకున్నారు. ఆరోజునుంచే ప్రతిరోజూ 30–40 వీధికుక్కలకు ఆహారం పెడుతున్నానని చెప్పారు. గాయపడిన పక్షులు, కుక్కలకు వైద్యం చేయించి, సంరక్షిస్తున్నానని తెలిపారు. గాయాల్నుంచి కోలుకున్న పావురం కూడా అక్కడుంది. శ్రీనివాసరావు భార్య, డిగ్రీ చదువుతున్న ఇద్దరు పిల్లలు కూడా ఆయన సేవలకు సహకరిస్తుండటం విశేషం. కాలనీలో పలువురికి శ్రీనివాసరావు సేవ నచ్చటం లేదు. వాటిని పోగేస్తున్నావంటూ ఒక్కోసారి ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారనీ బాధపడుతుంటారు.

ప్రతిరోజూ ఆహారం..

ఆయన పేరు వంకమామిడి శ్రీనివాసరావు. తాతలు, తండ్రులది బొద్దులూరిపాడు అగ్రహారం. తెనాలిలోనే జన్మించిన శ్రీనివాసరావు క్రైస్తవ మతం స్వీకరించి 1991 నుంచి దైవసేవకుడి (పాస్టర్)గా ఉన్నారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని బీసీ కాలనీలో అద్దెఇంట్లో నివసిస్తున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం, రాత్రి ఇంట్లో వండించిన ఆహారం, పాలు, బిస్కెట్లు తీసుకుని తన ఇంటి దగ్గరి సెంటరుతో సహా కాలనీలో మూడుచోట్ల వీధికుక్కలకు ఆహారం ఇస్తున్నారు. వాటి సంతానానికి పాలు, బిస్కెట్లు అందిస్తున్నారు. వర్షం కురుస్తున్నా, తుపాన్ హెచ్చరికలున్నా సరే! ఆహారం ఇవ్వాల్సిందే. శ్రీనివాసరావు కోసం వీధి శునకాలు ఎదురు చూస్తుంటాయ్. ఆహారం బకెట్‌ను తగిలించుకుని వచ్చే బైక్ హారన్ శబ్దం వినటం ఆలస్యం... ఎక్కడెక్కడ మునగదీసుకుని పడుకున్న శునకాలన్నీ పరుగున వచ్చి, ఆయన్ను చుట్టుముడతాయ్. వాటన్నిటినీ ప్రేమగా పలకరిస్తూ, ఆహారం పెడతారాయన. వెజిటేరియన్‌తోనే సరిపెట్టకుండా, అప్పుడప్పుడూ నాన్‌వెజ్ వంటకాల రుచులనూ ఆస్వాదిస్తున్నాయి.


వీధికుక్కల ఆలన చూస్తూ..

డాక్టర్ పూర్ణప్రజ్ఞాచారికి జాషువా సాహితీ పురస్కారం

తెనాలి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సభలో మహాకవి జాషువా జాతీయ పురస్కారాన్ని తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి ప్రదానం చేశారు. సత్తెనపల్లి ఐఎంఏ హాలులో ఏర్పాటైన సభకు ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అధ్యక్షత వహిస్తారు. కార్యదర్శి స్వామి, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ అంజనీదేవి, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు, కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్, రమ్య తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ ప్రజ్ఞాచారి మాట్లాడుతూ నవయుగకవి చక్రవర్తి గుర్రం జాషువ పేరిట పురస్కారం అందుకోవటంపై సంతోషం వ్యక్తంచేశారు. తనకు లభించిన ఏడో జాతీయ అవార్డుగా తెలిపారు. జాషువా జాతీయ సాహితీ పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ పూర్ణ ప్రజ్ఞచారికి గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.


పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

24 నుంచి మహిమ పండుగలు

తెనాలిరూరల్: పట్టణ ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనా కొండ చర్చిలో ఈ నెల 24 నుంచి 27 వరకు మహాదేవుని మహిమ పండుగలు నిర్వహించనున్నట్టు బ్రదర్ ఆనందన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు రాత్రి ఏడు గంటలకు సువార్త సభలు ప్రారంభమవుతాయన్నారు. ఈ మేరకు పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించామన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

తెనాలిరూరల్: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ రామలింగేశ్వరపేట పాత డిపో ప్రాంతానికి చెందిన నీలం సాయితేజ గంజాయి విక్రయిస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందింది. అతనిపై నిఘా ఉంచగా కబేళా వంతెన వద్ద అతన్ని ఆదివారం అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 1135 గ్రాముల గంజాయి లభించింది. నిందితుడిని అరెస్ట్ చేసినట్టు వన్‌టౌన్ సీఐ వి.మల్లికార్జునరావు తెలిపారు. గంజాయి విక్రయించినా, కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ముువ్వల సవ్వడి అలరించగా..


నృత్యప్రదర్శనలో చిన్నారులు

ద్వారకా తిరుమలలో మెరిసిన తెనాలి తేజాలు

తెనాలి: ద్వారకా తిరుమలలో దేవస్థానం నిర్వహణలో జరుగుతున్న అశ్వయుజ మాస తిరుకళ్యాణ మహోత్సవాల్లో పట్టణానికి చెందిన ప్రముఖ యువనర్తకి, నృత్యగురువు ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య శిష్యబృందం కూచిపూడి నృత్యం అభినందనలు అందుకొంది. ఈనెల 13వ తేదీ నుంచి 20 వరకు ఈ ఉత్సవాలను నిర్వహించారు. చివరిరోజైన ఆదివారం సాయంత్రం తేజస్వి ప్రఖ్య బృందానికి అవకాశం కల్పించారు. ద్వారక తిరుమలలోని కళావేదికపై జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో ప్రఖ్య శిష్యబృందంలోని యనమదల రీతిక, ఆరిశెట్టి ఐశ్వర్య, మునిపల్లి పావని, మునిపల్లి భవానిలు అన్నమాచార్య కీర్తనలకు నృత్యం చేశారు. దేవస్థానం అధికారులు సిబ్బంది నృత్యగురువు తేజస్వి ప్రఖ్య శిష్య బృందానికి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. గత నెలరోజుల్లో ప్రతిష్టాత్మక కాణిపాకం బ్రహ్మోత్సవాలు, తిరుమల బ్రహ్మోత్సవాలు, పైడితల్లి అమ్మవారి సిరి మానోత్సవం, ద్వారకా తిరుమల బ్రహ్మోత్సవాల్లో నృత్యాంశాలను ప్రదర్శించిన ప్రఖ్య, ఆమె శిష్యబృందానికి స్థానికులు అభినందనలు తెలియజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ఫిరంగిపురం: సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మేడికొండూరు సీఐ నాగూర్ మీరాసాహెబ్ అన్నారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో ఏస్పీ సతీష్ కుమార్ ఆదేశాలతో వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌ను తీయవద్దని చెప్పారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. అనవసరంగా వివాదాలు, గొడవలకు దిగితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఫిరంగిపురం సీఐ రవీంద్రబాబు, సిబ్బంది ఉన్నారు.

దాడి చేసిన వ్యక్తుల అరెస్ట్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని రామచంద్రాపురంలో ఇసుక అక్రమ రవాణాలో తలెత్తిన వివాదంలో ఓ వ్యక్తిపై బాబాయి, అబ్బాయిలు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో మంగళగిరి రూరల్ పోలీసులు ఆదివారం దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరు పరిచారు. మంగళగిరి రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకట్ వివరాల మేరకు.. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న పల్లెపు హరికృష్ణ, రామకృష్ణ గురించి పోలీసులకు సమాచారం ఇస్తున్నాడనే అనుమానంతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మరో వ్యక్తి సురేష్‌పై దాడి చేశారు. ఈ ఘటనపై సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పల్లెపు హరికృష్ణ, రామకృష్ణను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

గుంటూరు సభను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ విధానాలు, ఆర్థిక మాద్యం, మతోన్మాదం తదితర అంశాలపై గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఎంటీఎంటీ పరిధిలోని చిర్రావూరులో కరపత్రాలు పంపిణీ చేస్తూ, విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించి, మతోన్మాద పాలన సాగిస్తోందన్నారు. అదేవిధంగా జెమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను కాలరాసే విధంగా పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. క్రిమినల్ చట్టాలలో మార్పులు తీసుకువచ్చి, ప్రతిపక్షాలపైన, ఉద్యమ కారులపైన, నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని, వామపక్ష అభిమానులను నిర్బంధించే ప్రక్రియను ఇప్పటికే మొదలు పెట్టారన్నారు. గుంటూరులో సమకాలీన రాజకీయ పరిణామాలపై జరిగే సభకు సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు పాల్గొని, ప్రసంగిస్తారని చెప్పారు. సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, చిర్రావూరు కార్యదర్శి బొప్పన గోపాలరావు, నాయకులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, పల్లపాటి సుబ్బారావు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు


ప్రచారం నిర్వహిస్తున్న జొన్నా శివశంకరరావు

సదస్సును జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్ : వ్యవసాయ రంగాన్ని చిన్నాభిన్నం చేస్తూ, రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఈ నెల 22న విజయవాడ ఎంబీవీకేలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో రైతు సంఘం నాయకులతో కలసి విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి శివ, బాబు, భూపతి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గోవులను వదిలితే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

రేపల్లె రూరల్: గోవులను, ఇతర పెంపుడు జంతువులను యజమానులు రహదారులపైకి వదిలితే సహించేదిలేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు చెప్పారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై సంచరిస్తున్న గోవులను ప్రత్యేక సిబ్బందితో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గోవులు, ఇతర జంతువులు రహదారులపై సంచరిస్తుండడంతో ఆ మూగజీవాలు గాయాలపాలవ్వటంగానీ, మృత్యువాత పడటంగానీ జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా వాటివల్ల వాహన చోదకులు సైతం గాయాలపాలైన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. జీవాలు రహదారులపై సంచరించకుండా ఇప్పటికే నోటీసులు జారీ చేయటం, పట్టణంలో మైకుల ద్వారా తెలియజేయటం జరిగిందని పేర్కొన్నారు. అయినా రహదారులపై సంచరిస్తున్న ఆవులను ప్రత్యేక సిబ్బంది ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, శానిటరి సెక్రటరీ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెనాలిలో భారీవర్షం



తెనాలిఅర్బన్: అల్పపీడన ప్రభావం తెనాలిని వీడటం లేదు. ప్రతి రోజు ఉదయం వేసవి తాపం, మధ్యాహ్నం నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తునే ఉంది. ఆదివారం ఉదయం కూడా ఎండ కాచింది. మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి సుమారు గంట పాటు భారీవర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. వర్షం ఆగిపోయిన తరువాత రోడ్లపై చేరిన వర్షపు నీరు బయటకు వెళ్లిపోయాయి. అనంతరం రోడ్లు మురుగుతో కనిపించాయి.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



తాడేపల్లిరూరల్ : స్థానికంగా ఉన్న అధికారులకు ఉచిత ఇసుకపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు అందలేదు. ఆదివారం తెల్లవారుజామున చిర్రావూరు నుంచి నిషేధిత ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో తాడేపల్లి పోలీసులు మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు. సీజ్ చేసిన విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. ఒక పక్క ఉచిత ఇసుక అంటూ మరో పక్క ట్రాక్టర్లను సీజ్ చేయడం పట్ల ట్రాక్టర్ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మూడు వాహనాలు చిర్రావూరుకు చెందిన బాజి, ప్రసాద్, హరీష్ అనే వ్యక్తులువిగా తెలియవచ్చింది.

బద్వేల్ దోషులను కఠినంగా శిక్షించాలి



తాడేపల్లిరూరల్ : కడప జిల్లా బద్వేలులో ఇంటర్ చదువుతున్న విద్యార్థినిని ప్రేమపేరుతో పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మన రాష్ట్రంలో మహిళలకు ఏ మాత్రం భద్రత లేని స్థితిలో ఉందని, ముఖ్యమంత్రి ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయో, వాటిని అరికట్టడానికి ఏ చర్యలు చేపడతారో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇంటర్ చదువుతున్న దస్తగిరమ్మను ప్రేమ పేరుతో వేధించిన నిందితుడు గణేష్‌ను, అతనికి సహకరించిన స్నేహితులను కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు ఆ ప్రకటనలో తెలిపారు.

దస్తగిరి కుటుంబానికి న్యాయం చేయాలి


షేక్ అబ్బాస్

మేడికొండూరు: ఒక ఉన్మాది చేతిలో అతికిరాతంగా హత్యకు గురైన దస్తగిరి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు షేక్ నాజర్ వలి అబ్బాస్ ఆదివారం అన్నారు. కడప జిల్లా బద్వేలులో మైనార్టీ వర్గానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి షేక్ దస్తగిరిను కిరాతకంగా హతమార్చిన విగ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా అతి త్వరగా కఠిన శిక్ష పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అబ్బాస్ డిమాండ్ చేశారు.

ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ కుంచన పల్లిలో మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్ కుమార్ మాట్లాడుతూ కుంచనపల్లిలోని రామ్ స్నేహ ఎవెన్యూ అపార్ట్‌మెంట్ నందు వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, వైద్యులు సుమారు 160 మందికి వివిధ రకాల ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు చెప్పారు. ఈ వైద్య శిబిరంలో వెంకటరెడ్డి, పరమేశ్వరి సుబ్బారెడ్డి, హనుమాన్, రాజారెడ్డి, శ్రీనివాస్, సుధాకర్, బాబు, విజయ్, నందు పాల్గొన్నారు.

రీసర్వేపై గ్రామసభలు

భట్టిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఈ నెల 24, 29 నవంబర్ 2వ తేదీలలో గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. 24న గొరిగపూడి, 29న కోనేటిపురం, నవంబర్ 2న పల్లెకోన గ్రామాల్లో ఈ గ్రామ సభలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సభల్లో ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొనాలని, తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని తెలిపారు.

మానవత ఉద్యమ నిర్మాణం అవసరం

వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు

తెనాలి: కులం మతం భాష, ప్రాంతం పేరుతో విడిపోతున్న రోజుల్లో అందరినీ కలిపివుంచే మానవత కోసం ఉద్యమ నిర్మాణం ఎంతో అవసరమని, ఎందరో చైతన్యమూర్తులు నడయాడిన తెనాలి అందుకు నాంది పలకాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. పాఠశాల స్థాయి నుంచి గాడితప్పుతున్న సమాజానికి మానవత్వ భావజాలాన్ని ఎక్కించి, మంచి సమాజ ఆవిష్కరణకు ఎవరికివారు తోడ్పడాలని సూచించారు. మానవత స్వచ్ఛంద సంస్థ, తెనాలి శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఏఎస్‌ఎన్ డిగ్రీ కాలేజి లైబ్రరీ హాలులో నిర్వహించారు. తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. డాక్టర్ సుబ్బారావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, పరిపూర్ణ వ్యక్తిత్వంతో ఉండటమే మానవత్వమని చెబుతూ ఈగో ఉన్న మంచి మనిషికి మానవత్వం లేకపోవటం అనర్థమేనన్నారు. ఇతరులను గౌరవించటం, ఆనందంగా జీవించటం, పరోపకారం చేయటం మానవత లక్షణాలుగా చెబుతూ ముందుగా తల్లిదండ్రులు, పెద్దలు వీటిని ఆచరించినపుడు కుటుంబం, తద్వారా సమాజం అనుసరిస్తుందని వివరించారు. సంస్థ రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సంస్థ సభ్యత్వాన్ని వెయ్యికి చేర్చేందుకు సభ్యులు కృషిచేయాలని కోరారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ, సమాజంలో ముందుగా తల్లిదండ్రులు ఆదర్శంగా మారాల్సిన ఆవశ్యకతను సోదాహరణంగా వివరించారు. పట్టణానికి చెందిన మొవ్వ సాంబశివరావు తన కుమార్తె మొవ్వ భవాని జ్ఞాపకార్థం, మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థి షేక్ బాబాషరీఫ్‌కు ఒక ఏడాదికయే ఖర్చు రూ.55 వేల ఆర్థికసాయం మానవత ద్వారా అందజేశారు. సాంబశివరావు కుమారుడు హేమంత్‌కుమార్, ఇతర కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, కన్వీనర్ తన్నీరు శ్రీనివాసబాబు, కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, కోశాధికారి ఎస్వీ శర్మ, పావులూరి శ్రీనివాసరావు, ఆలపాటి వెంకట్రామయ్య, అయినాల మల్లేశ్వరరావు, వెంపటి సత్యనారాయణ, మానవత సభ్యులు పాల్గొన్నారు. ముందుగా రతన్‌టాటా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.


వైద్యవిద్యార్థికి రూ.55 వేల ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

హిందూ ధర్మం విశ్వజనీయం

సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు

తెనాలి: సమరసత సేవా ఫౌండేషన్ తెనాలి రూరల్, కొల్లిపర మండలాలకు చెందిన గ్రామ కన్వీనర్ల ఒక రోజు శిక్షణా తరగతులు ఆదివారం స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో నిర్వహించారు. తెనాలి ఖండ ప్రముఖ్ కడియాల సునీల్ కుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ హిందూ ధర్మం విశ్వజనీయం అన్నారు. ప్రపంచశాంతిని కోరుకుంటున్న హిందూ ధర్మం సనాతనమైనదని చెప్పారు. భగవద్గీత ప్రపంచంలో అత్యుమైన వ్యక్తిత్వ వికాస గ్రంథమని చెబుతూ రామాయణం మానవాళికి మార్గదర్శిగా మానవ నడవడికను తెలియజేసి కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఇంతటి విశిష్టమైన హిందూ ధర్మాన్ని రక్షించాల్సిన భాధ్యత గ్రామ కన్వీనర్లదేనని స్పష్టంచేశారు. హనుమత్ ప్రసాద్, అప్పికట్ల వెంకటేశ్వరరావు, మహిళా కన్వీనర్ విజ్జల సునీత, నందికంటి రామాంజనేయులు, మోదడుగు పవన్ రెడ్డి, క్రాప రవికుమార్, సమరసత సేవ ఫౌండేషన్ గ్రామ ధార్మిక సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జంజనం హేమశంకరరావు

'పల్లెపండుగ'లో రహదారుల అభివృద్ధి

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన మంత్రి మనోహర్

తెనాలిరూరల్: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పౌరసరఫరా, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఉదయం ఎరుకలపూడి గ్రామం నుంచి ప్రారంభమైన పల్లె పండుగ కఠెవరం, ఖాజీపేట, కొలకలూరు, సంగం జాగర్లమూడి, అంగలకుదురు, మల్లెపాడు, జగ్గడి గుంటపాలెం గ్రామాల్లో సాయంత్రం వరకూ కొనసాగింది. ఆయా గ్రామాల్లోని ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీ, బీసీ కాలనీల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంత్రి మనోహర్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ల ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో పండుగ వాతావరణం తీసుకువచ్చేందుకు పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణ కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 4,500 కోట్లతో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లను నిర్మించటం జరుగుతుందని తెలిపారు. దీనిలో భాగంగానే తెనాలి నియోజకవర్గంలో రూ. 2.55 కోట్లతో అన్ని గ్రామాల్లో రోడ్ల నిర్మాణంకు చర్యలు తీసుకోవడం జరిగిందని మంత్రి తెలియజేశారు. అలాగే మరో రూ. 50 లక్షలతో రోడ్ల నిర్మాణంను చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. మంత్రి మనోహర్‌తో పాటు ఆయా గ్రామాల్లోని తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్

కమ్యూనిస్టు ఉద్యమ పురిటిగడ్డ తాడేపల్లి

తాడేపల్లిరూరల్ : కమ్యూనిస్టు ఉద్యమ పురిటిగడ్డ తాడేపల్లి అని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. ఆదివారం తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద మేకా అమరారెడ్డి 43వ వర్ధంతి సభను పార్టీ పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రామారావు అమరారెడ్డి, బండారు ముత్యాలు, మాలకొండారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం త్యాగాలు చేసిన వారిలో మేకా అమరారెడ్డి, బండారు ముత్యాలు, వెన్నపూస మాలకొండారెడ్డి ఉన్నారని చెప్పారు. తాడేపల్లి ప్రాంతంలో వేలాది మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు వేయించిన చరిత్ర సీపీఎం పార్టీదేనన్నారు. ఇందులో అమరారెడ్డి లాంటి త్యాగధనుల ప్రాత ఉందన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు ప్రపంచ బ్యాంక్ నుంచి రాష్ట్రానికి అప్పు ఇప్పిస్తే, అదేదో కేంద్ర ప్రభుత్వం ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం సరైంది కాదన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఇళ్ల పట్టాలు, స్థలాల రిజిస్ట్రేషన్ చేయిస్తానని మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ శిలాఫకం వేసి, హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి, వేముల దుర్గారావు, పాశం రామారావు, గాదే సుబ్బారెడ్డి, ఎ.జగన్, దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, డి.శ్రీనివాసకుమారి, గాది సుబ్బారెడ్డి, కొట్టే కరుణాకర్, కోట బాబూరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

వైద్యశిబిరానికి విశేష స్పందన

బాపట్ల: బాపట్ల యజ్ఞ హాస్పిటల్ ఆధ్వర్యంలో ముత్తాయపాలెంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ యజ్ఞ శ్రీకాంత్, డాక్టర్ మాధవి, డాక్టర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో రోగులకు వైద్యసేవలు అందించారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ యజ్ఞ శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు యజ్ఞ హస్పిటల్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు.